


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**76**

**(31 ‘ ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**తిరుపతి వేంకటేశ్వర** ప్రభువును గురించి ఏడుకొండల వైభవాన్ని గురించీ ప్రసంగం వచ్చినప్పుడు కొందరు "ఆ కొండ ఎక్కి ఆ స్వామికి మ్రొక్కే ప్రాప్తం ఇంతవరకు కలగలేదు. జీవితంలో ఏం పాపం చేసుకున్నామో" అని విచారపడుతూ ఉంటారు.

సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తుండగా చూడడానికి వచ్చినవాళ్ళు కొందరు "రెండేళ్ళనుంచి ప్రయత్నం. ఇంతవరకు వ్రతం చేసే అవకాశం కుదరలేదు. ఎప్పుడు ప్రాప్తమో ఏమిటో" అని దిగులు పడుతూ ఉంటారు.

***కళ్ళూ కాళ్ళూ ఉండగానే కాశీ.***

పూర్వకాలం వాళ్ళు "కళ్ళూ, కాళ్ళూ సరిగ్గా వుండగా వెళ్ళి కాశీ విశ్వనాథుణ్ణి దర్శించే ప్రాప్తం వుందో లేదో ఈ ఘటానికి" అని నైరాశ్యంలో పడుతూ వుండేవారు.

కొందరు ముసలమ్మలు వీధిని పోయేవారిని పలకరించి, నిలబెట్టి "ఇట్లా మొండికట్టెలాగా వీధిలో నిలబడటమేగాని, మనుమణ్ణి ఎత్తుకుని ముద్దులాడుతూ నిలిచే ప్రాప్తం ఇంతవరకు కలగలేదమ్మా! కోడలంటే కొడుకుని కంటుందనుకున్నాం గాని ఎక్కడేసిన గొంగళి అక్కడేనని ఎవరనుకుంటారు చెప్పమ్మా! "

"పెళ్ళాడేముందు నీళ్ళాడతావా? లేదా? అని ప్రశ్నించి చేసుకుంటామా? అందరి కోడళ్ళతో పాటేననుకున్నాం. వచ్చిన ఏడాదికల్లా వసారాలో జోలపాట వినిపిస్తుందనుకున్నాం. మాకా ప్రాప్తంలేదు. తల్లి ప్రాప్తం లేదు. ముందునుంచే మురిసినందుకు ప్రాయశ్చిత్తమైంది" అని ఎదురు బాదుకొంటుందావిడ.

***పనసకాయ ప్రాప్తం ప్రక్కింటికే.***

ఈ ప్రాప్తాలు భక్తినుంచి ముక్తివరకూ సంతానం నుంచి సుతవస్తువలవరకూ ఉంటాయి. "ప్రక్క ఇంటాయన సంతకెళ్ళి కుండంత పనసకాయ కొనుక్కు చక్కా వచ్చాడు. బారెడు ప్రొద్దెక్కగానే మా వాడు ఇడ్డెన్లు తిని, ఇట్లా, అట్లా తిరిగి, స్నానం చేసి, కాఫీ త్రాగి, కాసేపావిడతో కబుర్లు చెప్పి వెళ్ళేసరికి ఒక్క పనసకాయ లేదుట సంతలో. కొందామనుకున్న రోజున కోర్కె ఎక్కువవుతుంది. ఏం లాభం? ప్రాప్తం వుండొద్దూ. బుద్ధిపుట్టిన వారానికి సిద్ధించింది కోరిక అన్నట్లుంటాయి. ప్రాప్తాలు లేకపోతే ప్రక్క ఇంటి కొచ్చిన పనస మన ఇంటికి రాకపోవడమేమిటి? ఆ వాసన మనకు కొట్టి మనం బాధపడటమేమిటి?" అని ఒకనాడొక ముసలమ్మ ఆవేదన పడటం విన్నాను.

మనసైన చీరకట్టుకుని, తలకు మల్లెపూలు చుట్టుకుని, అరుగుమీద స్థంభం పట్టుకుని, మాటిమాటికీ కాలితో కుచ్చెళ్ళు నెట్టుకుని పారిపోతుందనే భయం కలిగినట్లు పమిటను గట్టిగా మెలివేసిపట్టుకుని, మధ్య మధ్య గడియారం చెవిదగ్గర పెట్టుకుని, అంతవరకూ ఎలాగో తట్టుకున్న పడుచు ఇల్లాలు.

*సినిమా మొదటిరోజు ప్రాప్తం.*

"అబ్బే ఇక ఇవ్వాల్టికి సినిమా ప్రాప్తంలేదు. ఎంత చెప్పినా వేళకు కొంపకు రారాయే!. రోజూ అయిదింటికే సంప్రాప్తమయ్యే మనిషి ఇవ్వాళ ఆరున్నరదాకా దయచేయక పోవడమేమిటి? ఇంతకీ మొదటి రోజున సినిమా చూచే ప్రాప్తం లేదు" అని స్వగతం చెప్పడంలో తగినంత అభినయం గోచరిస్తుంది.

"రెండేళ్ళ మా అమ్మాయిని ఫిలిం కంపెనీల చుట్టూ తిప్పావు. ఒక్క వేషం దొరుకుతుందేమోనని. శీలం అనుమానంలో పడిందిగాని సినిమా వేషం ప్రాప్తించలేదు" అని ఒక "పెంపుడు తల్లి" చెంపలు బాదుకుంటూ ఏడ్చింది.

*తారల్ని చూచే ప్రాప్తం దక్కలేదు.*

ఇటీవల మా మిత్రుడొకడు షష్టిపూర్తి దగ్గరలో పడింది. వచ్చాడు నన్ను చూడటానికి కొంచెం సేపు మాట్లాడిన తర్వాత "నీతో ఒకమాట చెప్పాలనుకుంటాను. ఇంతవరకు సినిమాతారల్ని వెండి తెరమీదా, పోష్టర్లలో చూడటమేగానీ ముఖాముఖిని చూచే అవకాశం లభించలేదు. ఈ కోరిక ఇలాగే వుండిపోయింది. నిజానికి నువ్వు మద్రాసులో ఉండగా ఎలాగో అలా తీరుబడి చేసుకుని వచ్చి అందర్నీ చూద్దామనుకున్నా. కానీ ప్రాప్తం లేదు. ఎప్పుడు వద్దామన్నా పడలేదు" అన్నాడు.

"అప్పుడు రావలసింది. చాలామందిని చూసేవాడిని" అన్నాను.

"అయిపోయిందేదో అయిపోయింది. పోనీ ఇపుడు నువ్వొస్తానంటే బయలుదేరతా! రెండు రోజులు ముందు చెప్పుచాలు" అన్నాడు.

ఈ సందర్భంలో వెనుకటి వృత్తాంతమొకటి జ్ఞాపకం వచ్చింది. నేను మద్రాసులో వుండగా మా యింటికో బంధువు వచ్చాడు. సుమారు ఇరవై యేళ్ళుంటాయి. వచ్చిన ఉద్దేశ్యం సినిమా స్టార్సుని చూడాలని కాబోలు.

ఒకరోజు ఉదయం శ్రీ నాగేశ్వరరావు, శ్రీ దుక్కిపాటి మధుసూదనరావును చూడటానికి వచ్చారు. శ్రీ మధుసూదనరావు మేమున్న ఇంటి మేడమీద ఉన్నారు. శ్రీ నాగేశ్వరరావు తిరిగి వెడుతూ మా సావిట్లోకి వచ్చి మాట్లాడి వెళ్ళారు. ఆ సమయంలో మా యింటికి వచ్చిన కుర్రవాడు "బాత్‌రూమ్"లో ఉన్నాడు. బయటికి రాగానే ఇలా నాగేశ్వరరావు వచ్చి వెళ్ళాడని చెప్పారు. ముందు కొంచెం సేపు నన్ను లేదు. నేను నిజమే నని చెప్పాను.

ఇక ఆ కుర్రవాడు ఇంచుమించుగా మూర్చపోయాడు. సోఫాలో పడుకుని తల బాదుకున్నాడు.

"ఛీ....ఛీ... దిక్కుమాలినవాణ్ణి. సమయానికి స్నానానికెళ్ళావేమిటి? ఒక అరగంట ఆగిచేస్తే ఏం ముంచుకుపోయింది. ఆయన్ని చూడటం పడితే అయిదురోజులు స్నానం చెయ్యకపోతే మాత్రం మేం.

*ఏడు గంటలకే వెధవ స్నానం.*

"ఇంటికి వచ్చినా చూడక పోవడమేమిటి? అయ్యొయ్యో! నాకు ప్రాప్తం లేదు ఇంత దూరం వచ్చినందుకూ, ఆయన ఇంటికి వచ్చినందుకూ నేను చూస్తే ఎంతో బాగుండేది. ఏడుగంటలకే వెళ్ళాను వెధవస్నానానికి. నాకు ప్రాప్తిలేదు. లేదు" అని తల బాదుకున్నాడు.

*కపాల మృదంగ వాద్యం*

ఆయన బాధ చూడలేక "ఎందుకంత ఇదిగా తల బాదుకుంటావు. సాయంత్రం నేను తీసుకువెళ్ళి చూపిస్తాలే" అని బ్రతిమాలి ఆ కపాల మృదంగ వాద్యం ఆపించాను.

ఈ ప్రాప్తాలనేవి ప్రతివారి నోటివెంటా అనేక మాట్లు వినిపిస్తూ వుంటాయి. నల్లటి నారీమణితో కాపురం చేస్తున్న పురుషుడు "ఈ జన్మకిక ఎర్రపెళ్ళాం ప్రాప్తంలేదు" అని మధ్య మధ్య దిగులు పడుతూ వుంటాడు.

వెనుక హిందీ తార దేవికారాణి రష్యన్ కళాకారుడు రోలిక్‌ను వివాహమాడిందనే వార్త పత్రికలో పడగానే మా మల్లినాధ సూరి చదివి ఆ అదృష్టం రష్యన్ వ్యక్తికి ప్రాప్తించింది. ముప్పయికోట్ల భారతీయులలో ఒక్కడికి దక్కలేదు" అని ఎంతో విచారపడ్డాడు.

ప్రాప్తాల చరిత్ర అనంతం. అందుకని ఇక్కడితో ఆపివేస్తున్నాను.

Post your comments